క్లుప్తంగా

సీఎండీని కలిసిన ఎస్ఈ



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా నూతన ఎస్ఈగా నియమితులైన రాఘవేంద్రం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును శనివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఉన్నారు.

కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్



కిరణ్‌కుమార్

నెల్లూరు (టౌన్): నెల్లూరు నగరానికి చెందిన నున్నా లక్ష్మీనరసింహ కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఐవీ రమణారెడ్డి పర్యవేక్షణలో స్ట్రెంగ్త్ అండ్ డ్యూరెబిలిటీ ఆఫ్ ఫ్లయాష్ బేస్డ్ సెల్ఫ్ కంపాక్టింగ్ జీఓ పాలిమర్ కాంక్రీట్ విత్ ది అడిషన్ ఆఫ్ నానోసిలికా అనే అంశంపై పరిశోధన గావించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌కు వర్సిటీ వారు డాక్టరేట్‌ను అందజేశారు. ఈ క్రమంలో ఆయనకు శనివారం పలువురు అభినందనలు తెలిపారు.

పీఎంఈవై అంగీకార్‌పై అవగాహన

నెల్లూరు(బారకాసు): అల్లీపురం ప్రాంతంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఈవై) 2.0 అంగీకార్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ సముదాయంలో మొక్కలు నాటి, ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, హౌసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సరస్వతి పూజలు



నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో విజయదశమి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని సరస్వతీదేవి నూతన విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్ రామారావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు రామ్‌ప్రసాద్, భవానిశంకర్, సుజాత, వర్క్‌షాపు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 54 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభమయ్యాయని డీసీఓ గుర్రప్ప తెలిపారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీలో జిల్లాలోని పీఏసీఎస్‌ల సీఈఓలకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లాలోని 41 పీఏసీఎస్‌ల ద్వారా 54 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,11,703 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్ కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

నెల్లూరు సిటీ: ఓ వృద్ధుడు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో ఒంటి నొప్పులు భరించలేక బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామంలో పెద్ద అంకయ్య(84) నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గత కొంత కాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఒంటి నొప్పులు తీవ్రంగా రావడంతో భరించలేక శుక్రవారం గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ రాఘవేంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి

నెల్లూరు(క్రైమ్): నైట్ సేల్స్ లేవన్నందుకు ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో మురళి వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై షాపు వద్దకు వచ్చారు. మద్యం కావాలని వాచ్‌మెన్‌ను అడగ్గా నైట్ సేల్స్ లేవని చెప్పడంతో వారు గొడవకు దిగారు. సమీపంలో రోడ్డుపై ఖాళీగా పడి ఉన్న బీర్‌బాటిల్ తీసుకుని వాచ్‌మెన్‌పై దాడి చేశారు. గాయాలపాలైన మురళి ఈమేరకు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుల గురించి ఆరా తీస్తున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహాలక్ష్మిగా..



శ్రీకృష్ణధర్మరాజ స్వామి ఆలయంలో లలితాపరమేశ్వరిగా..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవిగా..



పాహిమాం.. రక్షమాం

- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు

నెల్లూరు(బృందావనం): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆలయాల్లో ఆరో రోజు శనివారం వివిధ రూపాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చి కటాక్షించారు.

➡ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షీసుందరేశ్వరస్వామి ఆలయంలో లలితా కుంకుమార్చన, మహన్యాసం నిర్వహించారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్‌కుమార్- సువర్ణలక్ష్మి, కొమ్మన తిరుమలేశ్వరరెడ్డి- లక్ష్మీశిరీష దంపతులు, పొట్టేపాటి ద్వారకానాథ్‌రెడ్డి వ్యవహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జంజం శ్రీనివాసరావు, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఏలూరు శిరీష, సభ్యులు పర్యవేక్షించారు.

➡ స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మూలవర్లను ముత్యాలచీరతో అలంకరించారు. ఉభయకర్తలుగా ఏల్చూరు శ్రీనివాసరావు- లక్ష్మీకుమారి, కొనగళ్ల శ్రీనివాసులు- సుభాషిణి, వెంకటసాయిసందీప్- అనూష దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, నిచ్చెనమెట్ల చిరంజీవి, ఉమ్మెన జనార్దన్, ఆంజనేయులు, వేముల ప్రసాద్, మునగా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎం.రమేష్, పద్మజ, ఆర్.శ్రావణకుమార్, కృష్ణవేణి, ఆర్ఆర్ నాయుడు, సుందరమ్మ వ్యవహరించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు త్రిపురభైరవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా జి.వెంకటేశ్వర్లునాయుడు- సునీత, ప్రతాప్‌రెడ్డి- సుమన, దరిశి వెంకట సుబ్బారావు- లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఈఓ వి.గిరికృష్ణ పర్యవేక్షించారు.

➡ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పాలపర్తి సద్గురుమూర్తి- వరలక్ష్మి దంపతులు వ్యవహరించారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, జీసీ ధరమ్‌సింగ్, ఈఓ బి.మల్లికార్జునరెడ్డి, ప్రధానార్చకుడు ఆర్.శ్రీనివాసులు శర్మ పర్యవేక్షించారు.



మహాలక్ష్మమ్మ ఆలయంలో వైష్ణవిదేవిగా..



సీతారామస్వామి మందిరంలో పార్వతీదేవిగా..

➡ ఏసీ నగర్ కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.20 లక్షల కరెన్సీతో అలంకరించారు. ఉభయకర్తలుగా పెసల జగదీష్- లక్ష్మి, సీహెచ్ ప్రసాద్- కాంచన, బి.రాజేష్‌కుమార్ రెడ్డి- శ్రుతి దంపతులు వ్యవహరించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు పర్యవేక్షించారు.

➡ మెక్లిన్స్‌రోడ్డు విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఇందుకూరు గురుస్వామిఆచారి- రత్నమ్మ, వడ్రా రాజశేఖర్- అనిత, లాలాపేట సూర్యప్రకాష్ ఆచారి- సావితి దంపతులు, యద్దలపూడి బ్రహ్మతేజ, బ్రహ్మహర్ష సోదరులు వ్యవహరించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు పార్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ధనలక్ష్మి హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా పచ్చిపులుసు శ్రీరాములు- అనసూయ, పి.శ్రీనివాసరావు- సాయిలక్ష్మి, వెంకట ఆనందకిశోర్- శ్వేత దంపతులు వ్యవహరించారు.

➡ నవాబుపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు లలితా పరమేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డాక్టర్ సాదా వెంకటేశ్వర్లు- ప్రవీణ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆరంబాకం అన్వేష్ వ్యవహరించారు.

➡ నవాబుపేట పరుచూరివారివీధి కామిశెట్టి వారి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు వైష్ణవిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నవావరణ పూజలు విశేషంగా నిర్వహించారు. నిర్వాహకులు గాదంశెట్టి గోపాల్- శ్యామల దంపంతులు పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలో గురువాయూర్ మహావిష్ణు మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీస్వామిఅయ్యప్ప సేవా సమాజం కార్యవర్గం పర్యవేక్షించింది.

➡ మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కామాక్షీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. కొప్రపాటి నందకిశోర్- ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలాత్రిపుర సుందరి నృత్యానికేతన్ వారు నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది. మడతల గురవారెడ్డి- భారతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకుడు సాయిభరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి పర్యవేక్షించారు.

➡ నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. అర్చకుడు మాధవగిరి భాస్కరాచార్యులు కలశ పూజ, విశేష కుంకుమార్చన నిర్వహించారు.



గురువాయూర్ మహాలక్ష్మి ఆలయంలో సంతానలక్ష్మిగా..



మోహినీ అలంకారంలో వెంకటేశ్వరస్వామి



వేదగిరిలో విజయలక్ష్మిగా..

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ పాలకవర్గ నేతలు శనివారం కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్‌లను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువలు కప్పి, బొకేలు అందజేసి సన్మానించారు. అనంతరం జిల్లా ఎస్పీ అజితను ఆమె కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ చమర్తి జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్ కుమార్‌జైన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రవిప్రకాష్, ఎంసీ మెంబర్లు యాలమూరి రంగారావు, శ్రీహరిరెడ్డి, రాజేంద్రప్రసాద్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ హిమాన్షు శుక్లాను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ నేతలు

➡ నెల్లూరు రూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, చేనేత విభాగం జిల్లా కన్వీనర్ ఆశం సురేష్, కార్తీక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని అగ్నికుల క్షత్రియుల సమస్యలు, చేనేతలకు సంబంధించిన సమస్యలు ఆయనకు వివరించారు.

షరతుల్లేకుండా వాహనమిత్ర ఇవ్వాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు షరతుల్లేకుండా వాహనమిత్ర పథకం ఇవ్వాలని ఆటో కార్మిక సంఘం నగర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మసెంటర్ నుంచి వీఆర్సీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 31వ తేదీ నాటికి ఆటో, మోటార్ క్యాబ్, మాక్సీ క్యాబ్‌లు యాక్టీవ్‌గా ఉండి, లైసెన్స్ కలిగి, ఏపీలో రిజిస్టర్ అయి, ఆదాయ పన్ను చెల్లింపుదారునిగా ఉండకుండా, మూడెకరాల తడి భూమి, మున్సిపల్ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగు కంటే ఆస్తి ఉండకూడదు వంటి 16 రకాల నిబంధనలు పెట్టడంతో అనేక మంది ఈ పథకానికి దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పథకానికి ఎలాంటి షరతులు లేకుండా లైసెన్స్ కలిగిన ప్రతిఒక్కరికీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, బాబు, సీఐటీయూ, ఆటో కార్మిక సంఘం నాయకులు కత్తి శ్రీనివాసులు, సూర్య నారాయణ, శ్రీనివాసులు, ప్రేమ్‌నివాస్, లక్ష్మీపతి, జహీర్, రమణయ్య, రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

ఆర్ఐగా కృపాకర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కృపాకర్‌ను నియమించారు. ఈ మేరకు కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆంబర్‌ఉడ్ స్కూల్, పాతకొండాయపాళెం, సప్తగిరి కాలనీ, పడారుపల్లి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నెల్లూరు సిటీ: సంతపేట మార్కెట్ అగ్నిప్రమాద బాధితులకు మంత్రి నారాయణ రూ.50 వేలు చొప్పున శనివారం ఆర్థిక సాయం ప్రకటించారు. అగ్నికి ఆహుతైన ఎనిమిది షాపులకు రూ.50 వేలు, స్వల్పంగా దెబ్బతిన్న మరో 12 షాపులకు రూ.25 వేలు, బీటలు వచ్చిన మరో 30 షాపులకు రూ10 వేల లెక్కన సహాయం ప్రకటించారు. ఈ క్రమంలో బాధితులకు టీడీపీ నేతలు బియ్యం బస్తాలు, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి క్లినిక్, హాస్పిటల్స్ ట్రేడ్ లైసెన్సులు తప్పకుండా తీసుకోవాలని, బకాయిలున్న వారు పూర్తిగా చెల్లించాలని నగరపాలక కమిషనర్ నందన్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్(ఏఐఎంఏ) సభ్యులకు తెలియజేశారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఏఐఎంఏ సభ్యులు, డాక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ట్రేడ్ లైసెన్సులు పొందని వారు వెంటనే తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్సుల బకాయిలు రూ.36 కోట్లు ఉన్నాయన్నారు. కాగా ఏఐఎంఏ సభ్యులు కొన్ని సమస్యలను కమిషనర్ దృష్టికి పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, డాక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నక్షపై సమీక్ష

నక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నందన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో నిర్వహించారు. నక్ష ద్వారా నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో చేపడుతున్న సర్వే ప్రోగ్రామ్‌లో వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, అడ్మిన్ కార్యదర్శులు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు సంయుక్తంగా పాల్గొని సమన్వయంతో అన్ని అంశాలను అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలోపు నక్ష ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలని, ఆయా జియోగ్రాఫికల్ వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా డేటాను సమర్పించాలని తెలిపారు. సిటీ ప్లానర్ హిమబిందు, వార్డు సచివాలయ ప్లానింగ్ కో-ఆర్డినేషన్ టీమ్, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

కుక్కలకు కు.ని ఆపరేషన్లు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అనేక ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద నియంత్రించే దిశగా ఎన్ఎంసీ చర్యలు చేపడుతోంది. నగర పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న యానిమల్ బర్త్ కేర్(ఏబీసీ) సెంటర్‌లో శనివారం కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించారు. వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ పది కుక్కలకు సర్జరీలు చేశారు. ముందుగానే పట్టి ఉంచిన కుక్కలకు ఆపరేషన్లు చేసి వాటిని ప్రత్యేక కేజ్‌లలో ఉంచారు. కుక్కల సంతాన ఉత్పత్తిని కట్టడి చేసేలా సర్జరీలు చేస్తున్నట్లు వెటర్నరీ వైద్యాధికారి తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం వారం పదిరోజుల పాటు ప్రత్యేక కజ్‌ల్లో ఉంచుతామన్నారు. వాటికి అవసరమైన తాగునీరు, ఆహారంతో పాటు యాంటీ రేబిస్ టీకాలు సైతం అందిస్తున్నట్లు తెలిపారు.



సర్జరీ అనంతరం తిరిగి వాటిని కాలనీల్లో వదిలిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. నగరపాలక కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు 24వ డివిజన్ కనుపర్తిపాడు, 33వ డివిజన్ పొదలకూరు రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతాల్లో 83 కోతులను పట్టుకుని జిల్లా సరిహద్దు సమీపంలోని బద్వేలు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

చిరస్మరణీయులు సుధాకర్ ప్రసాద్

- ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి

నెల్లూరు(అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చి తన పోరాట పటిమతో ఎన్నో హక్కులను సాధించిన దివంగత తోట సుధాకర్ ప్రసాద్ చిరస్మరణీయులని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి అన్నారు. బీవీనగర్‌లోని ఆయన కాంస్య విగ్రహం వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. జిల్లాలో కలువాయి మండలం కుల్లూరుకు చెందిన సుధాకర్‌ప్రసాద్ రాష్ట్ర నేతగా ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ప్రకటన ఇస్తే గవర్నమెంట్ భయపడి చర్చలు జరిపేవన్నారు. ఆయన పోరాటంతో ఉద్యోగులు ఎన్నో హక్కులు సాధించుకున్నారన్నారు. నేడు ధర్నాలు, ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అందువల్లే ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యోగ సంఘాలను కలుపుకుని హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఆందోళన చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం సుధాకర్ ప్రసాద్ జీవితంపై ఆయన భార్య కామాక్షమ్మ రాసిన విక్రమ సింహపురి వీర సింహం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శరత్‌బాబు, వెంకయ్య, ఎడ్ల నాగేశ్వరరావు, ముత్యం నరసింహులు, చిరంజీవి, ప్రసాద్, డానియేల్ పీటర్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, బాలకోటమ్మ, భాగ్యలక్ష్మి, వెంకట్, సతీష్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్ ప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు

➡ నెల్లూరు రూరల్: సుధాకర్ ప్రసాద్ వర్ధంతి సందర్భంగా స్థానిక దర్గామిట్ట ఏపీఎన్జీఓ హోమ్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారిపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, జిల్లా ట్రెజరర్ ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంచలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని, నివాళులర్పించారు.

గతాన్ని మరిచి మాట్లాడడం సంస్కారహీనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): శీనయ్య నీ స్థాయిని మించి మాట్లాడుతున్నావ్.. గతాన్ని గుర్తు పెట్టుకోకుండా ఇష్టమొచ్చినట్లు వాగడం సంస్కారహీనమని వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శీనయ్య నీ భాష నీ స్థాయిని మించి ఉందన్నారు. గతంలో మహా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సినిమా రంగానికి ఏమి చేశారో మరిచి ఇప్పుడు అవహేళనగా మాట్లాడడం నీ వ్యక్తిత్వాన్ని తెలియచేస్తోందన్నారు. అఖండ సినిమా విషయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత ఉదారంగా ఉన్నారో మర్చిపోయి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇష్టమొచ్చిన రీతిలో తమ నాయకులను సంబోధించడం తగదన్నారు. ఎంతో సేవలందించిన మాజీ మంత్రులను విమర్శించడం నీకు తగదన్నారు. బాలకృష్ణ జీవితంలో ఏం జరిగిందో ప్రతిఒక్కరికీ తెలుసునని, నువ్వు భుజాన వేసుకొచ్చి ఆయన గురించి గొప్పగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నువ్వు ఇదే విధంగా మాట్లాడితే ఎలా సమాధానం చెప్పాలో తమకు తెలుసన్నారు.



మాట్లాడుతున్న బొబ్బల శ్రీనివాస్ యాదవ్

ప్రయాణం.. నరకప్రాయం

- ఇంటర్ కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో పోటెత్తిన విద్యార్థులు
- తగిన బస్సుల్లేక గంటల తరబడి నిరీక్షణ

నెల్లూరు సిటీ: ప్రైవేటు ఇంటర్ కళాశాలలకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు పోటెత్తారు. భారీగా విద్యార్థులు చేరుకోవడంతో ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం కిటకిటలాడింది. దసరా సెలవులు కావడంతో వేల సంఖ్యలో ప్రయాణికులు ఊర్లకు వెళ్తుండగా, విద్యార్థులు కూడా వందల సంఖ్యలో ఉండడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా కడప, బద్వేల్, మర్రిపాడు, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు అధిక సంఖ్యలో పడిగాపులు కాశారు. ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడం, తగిన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు సాయంత్రం వరకు ఆర్టీసీ బస్టాండుల్లో వేచి చూశారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో వేచిచూస్తున్న విద్యార్థులు

ప్రైవేటు వాహనాల్లో..

ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేందుకు సీట్లు కూడా ఖాళీ లేకపోవడంతో కొందరు విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఆటోల ద్వారా వివిధ ప్రాంతాలకు ఆటోల్లో మారుతూ ఇళ్లకు చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులు కనీసం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనధికార నిర్మాణాలను తొలగించండి

నెల్లూరు(బారకాసు): స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో అనధికారికంగా ఏర్పాటు చేసి ఉన్న నిర్మాణాలు, దుకాణాలను వెంటనే తొలగించాలని కమిషనర్ నందన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వెనుక ప్రాంతం గుర్రం జాషువా వీధిలో కమిషనర్ శనివారం పర్యటించారు. ప్రభుత్వ స్థలాలను, రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలను చేపట్టకుండా, దుకాణాలు ఏర్పాటు చేయకుండా నిరంతరం అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.